సాక్షి చిత్తూరు

ఆదివారం । 3 । సెప్టెంబర్ । 2023



పకడ్బందీగా సర్టిఫికెట్ల పరిశీలన

చిత్తూరు కలెక్టరేట్‌లో గ్రూప్‌–4 అభ్యర్థుల సర్టిఫికెట్లను శనివారం పకడ్బందీగా పరిశీలించారు. - 8లో



వైఎస్సార్‌సీపీలోకి నేతలు

చిత్తూరులోని శంకరయ్యగుంట, పెద్దహరిజనవాడకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	32	24
తిరుపతి	33	26
తిరుమల	28	21
గూడూరు	34	26
నగరి	34	26

న్యూస్‌రీల్

సంకటాలు హరించే స్వయంభువు



కోటేశ్వరరావుకు జ్ఞాపిక అందిస్తున్న మోహన్ రెడ్డి, వెంకటేశు, శాంతిసాగర్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): భక్తుల సంకటాలు హరించి సంతోషం కలిగించేందుకే కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి స్వయంభువుగా వెలిశారని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచించారు. శనివారం ఆయన కాణిపాకం విచ్చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. వేదపండితులు ఆశీర్వదించి వరసిద్ధుని శేషవస్త్రం, చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆస్థాన మండపంలో భక్తులనుద్దేశించి కోటేశ్వరరావు మాట్లాడారు. స్వామివారి ప్రాశస్త్యం, సంకటహర చతుర్థి వ్రతం విశిష్టత, దేవస్థానం ప్రాచుర్యం గురించి భక్తులకు వివరించారు. కాణిపాకంలో వినాయక స్వామి స్వయంభువుగా బావిలో వెలిశారన్నారు. బావిని తవ్వినవారి వైకల్యాన్ని పోగొట్టి వరప్రదాతగా నిలిచారని తెలిపారు. తనను పూజించే భక్తుల కష్టాలు, కోర్కెలను తీరుస్తున్నారన్నారు. దీంతో భక్తులు ఆనంతంగా ఉన్నందున ఆయన కూడా సంతోషంగా పెరుగుతున్నారని వివరించారు. వేకువనే స్వామివారికి నిర్వహించే సహస్రనామార్చనలో పాల్గొంటే ఎంతో పుణ్యఫలం దక్కుతుందని వెల్లడించారు. ఆలయంలో నిర్వహించే సంకటహర చతుర్థి గణపతి వ్రతాన్ని ఆచరిస్తే సంకటాలు అన్నీ తొలగిపోతాయని వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు కృష్ణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ రంగస్వామి, కోదండపాణి, సీఐ రవిశంకర్ రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ



స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్: నగరంలోని పలు స్కానింగ్ సెంటర్లు, క్లినిక్‌లలో శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పీసీపీఎన్‌డీటీ రవిరాజు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్‌లు, స్కానింగ్ సెంటర్లను గుర్తించారు. 15రోజుల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోని క్లినిక్‌లను సీజ్ చేస్తామని, నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే సకాలంలో రెన్యూవల్ సైతం చేయించుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓ జార్జ్, డెమో రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సచివాలయ సేవలకు అభినందన



జ్ఞాపిక అందుకుంటున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న సచివాలయ వ్యవస్థ సేవలు అద్భుతంగా ఉన్నాయని డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధులు అభినందించారని జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ బెంగళూరులో నిర్వహించిన రీజనల్ టీబీ ముక్త్ పంచాయత్ వర్క్‌షాప్‌లో ప్రభుత్వం తరపున పాల్గొన్నట్లు వెల్లడించారు. సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలు, ఆరోగ్యకరమైన పంచాయతీలపై ప్రజెంటేషన్, యాక్షన్ ప్రణాళికను అందజేసినట్లు వివరించారు. టీబీ ముక్త్ పంచాయతీ అమలుకు ఉన్న సోర్స్‌లను తెలియజేశామని, దీనిపై కేంద్రప్రభుత్వం, డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధులు ప్రశంసించారని పేర్కొన్నారు.

అందరి మదిలో మహానేత

సంక్షేమ ప్రదాతను స్మరించుకున్నారు.. అభివృద్ధి దార్శనికుడి సేవలను మననం చేసుకున్నారు.. గుండె గుడిలో కొలువైన పేదల దేవుడిని మదిలో నిలుపుకున్నారు. జలయజ్ఞం చేపట్టి బంజరు భూములను సస్యశ్యామలం చేసిన రైతుబాంధవుడికి మనసారా కృతజ్ఞతలు తెలుపుకున్నారు. నమస్తే అన్నా.. నమస్తే తమ్ముడూ.. నమస్తే అక్కయ్యా.. నమస్తే చెల్లెమ్మ అంటూ దివికేగిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి స్మృతులను నెమరువేసుకుని నమస్సుమాంజలి ఘటించారు. మహనీయుడికి గమనం తప్ప మరణం లేదు అంటూ వేనోళ్ల కొనియాడారు.

తిరుపతిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి





చిత్తూరులో వైఎస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు

- వాడవాడలా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి
- ఘనంగా నివాళులర్పించిన ప్రజానీకం
- ఊరూరా పేదలకు అన్నదానం
- సంక్షేమ ప్రదాత సేవలను కొనియాడిన నేతలు

చిత్తూరు రూరల్ : దివంతగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని శనివారం జిల్లా వ్యాప్తంగా జరుపుకున్నారు. మహానేత సేవలను స్మరించుకుని ఘనంగా నివాళులర్పించారు. వాడవాడలా కొలువైన వైఎస్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. అభిమాన నాయకుడికి ప్రజాప్రతినిధులు.. వైఎస్సార్‌సీపీ శ్రేణులు జోహార్లర్పించారు. ఊరూరా విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టారు.

- కుప్పం బస్టాండు వద్ద వైఎస్సార్ విగ్రహానికి ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్సీ భరత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్ వర్ధంతిని పురస్కరించుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. రాజన్న సేవలను కొనియాడారు.
- చిత్తూరులోని డీసీసీబీ కార్యాలయం వద్ద వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద పుష్పాంజలి ఘటించారు. నగరంలోని పలు చోట్ల పేదలకు అన్నదానం చేశారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి ఆధ్వర్యంలో మహానేత విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దొడ్డిపల్లె సప్తకనికలమ్మ ఆలయం వద్ద, సత్యనారాయణపురంలో అన్నదానం చేశారు. ఎంఎస్‌ఆర్ కూడలిలో మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్ అన్నదానం చేపట్టారు.
- పూతలపట్టు, బంగారుపాళ్యం, యాదమరి మండలాల్లో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఆధ్వర్యంలో రాజన్న విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు.
- పలమనేరులో వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే వెంకటేగౌడ పూలమాల వేసి అంజలి ఘటించారు. పేదలకు అన్నదానం చేశారు. పెద్దపంజాణిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ ఆర్.విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. వైఎస్సార్ సేవలను గుర్తు చేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.
- పుంగనూరులో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌భాషా ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సదుం మండలంలో వైఎస్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి పూలమాల వేసి జోహార్లర్పించారు.
- నగరిలో వైఎస్సార్ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ సీజీ నీలమేఘం అంజలి ఘటించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద సిబ్బందికి కమిషనర్ వెంకటరామిరెడ్డి యూనిఫామ్ పంపిణీ చేశారు.
- జీడీనెల్లూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నేతలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.



పలమనేరులో వైఎస్సార్‌కు జోహార్లర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ తదితరులు



పుష్పాంజలి ఘటిస్తున్న విజయానందరెడ్డి



సదుంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి నివాళులు



చిత్తూరులో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి



పూతలపట్టు : నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



నగరిలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత రాంప్రసాద్‌రెడ్డి

క్రైస్తవుల అభ్యున్నతికి కృషి



మంత్రి రోజాను సత్కరించి ఆశీర్వదిస్తున్న బిషప్ జార్జి స్టీఫెన్

నగరి : క్రైస్తవుల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. శనివారం సత్రవాడ దళితవాడలో నూతనంగా నిర్మించిన సీఎస్‌ఐ ఏసు అంబర్ చర్చి ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. చర్చి నిర్మాణానికి రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.1.5లక్షల విలువైన గ్రానైట్ రాళ్లు అందించినందుకు మంత్రికి బిషప్ జార్జ్ స్టీఫెన్ అభినందించారు. ఘనంగా సత్కరించి ఆశీర్వదించారు. మంత్రి మాట్లాడుతూ క్రైస్తవ సోదరులు రెండు పర్యాయాలు ఎన్నికల్లో మద్దతు పలికారని తెలిపారు. నగరి సీఎస్‌ఐ నిర్వహణ అధికారులు మాథ్యూ, సత్యమూర్తి, మున్సిపల్ వైస్ చైర్మన్ బాలన్, స్థానిక నాయకులు రమేష్, దినకర్, మేషాక్, సుభాషిణి, పునీత పాల్గొన్నారు.

గజ బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందిస్తున్న విజయానందరెడ్డి

గుడిపాల : మండలంలోని 190 రామాపురం వద్ద ఏనుగుదాడిలో ప్రాణాలు కోల్పోయిన వెంకటేష్, సెల్వి కుటుంబానికి శనివారం ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి ఆర్థిక సాయం అందించారు. వెంకటేష్ కుమారులు విక్రమ్, రాకేష్‌కు రూ.2లక్షలు అందజేశారు. వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. డిప్యూటీ మేయర్ రాజేష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు గోళ్ల హరిప్రసాద్, చిట్టిబాబు, కార్పొరేటర్ మధురెడ్డి పాల్గొన్నారు.

జగనన్న పాలనలో యువతకు ఉపాధి

కుప్పంరూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో యువతకు పెద్దసంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చాయని ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. శనివారం కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాను ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థ ద్వారా 4.5లక్షల ఉద్యోగాలు ఇచ్చారని వెల్లడించారు. వైద్యరంగలో 15వేల పోస్టులను భర్తీ చేశారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో పేద విద్యార్థుల చదువుకు సహకరిస్తే, జగనన్న మరో అడుగు ముందుకు వేసి ఉద్యోగావకాశాలు కల్పించారని వివరించారు. చంద్రబాబు నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం అంటూ మాయమాటలు చెబుతున్నారని ఆరోపించారు. అనంతరం నిర్వహించిన జాబ్‌మేళాలో మొత్తం 1,500 మంది అభ్యర్థులు హాజరు కాగా, 950 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. డీఆర్‌డీఏ మేనేజర్ సరితారెడ్డి మాట్లాడుతూ మొత్తం 22 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నియమాకపత్రాలు అందజేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్మన్ సుధీర్, ఎంపీపీ అశ్వని, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, హెచ్‌ఎం మురుగేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్, పక్కన ఎంపీ రెడ్డెప్ప తదితరులు

ఉపకార వేతనాలకు ఆధార్ బయోమెట్రిక్

చిత్తూరు కలెక్టరేట్ : మైనారిటీ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ నెల 4వ తేదీ లోపు ఆధార్ బయోమెట్రిక్ నమోదు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2022–23 విద్యాసంవత్సరానికి ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్, మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్‌షిప్‌లు అందజేయనున్నట్లు చెప్పారు. స్కాలర్‌షిప్ సత్వర పంపిణీకి ఆధార్ నంబర్, బ్యాంక్ ఖాతాతో ఫీడ్ చేయబడిందని నిర్ధారించుకోవాల్సి ఉంటుందని వివరించారు. scholarships.gov.in వెబ్‌సైట్‌లో సూచనల మేరకు ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7382781316 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మొగిలి ఘాట్‌లో ఘోర ప్రమాదం

- లారీని వెనకనుంచి ఢీకొన్న కారు
- ఒకరి మృతి, నలుగురికి తీవ్రగాయాలు
- తిరుమల శ్రీవారిని దర్శించుకుని వెళుతుండగా ఘటన



ధ్వంసమైన కారు

పలమనేరు : పట్టణ సమీపంలోని మొగిలి ఘాట్‌లో చెన్నై– బెంగళూరు హైవేపై శనివారం వేకువజామున ఘోర ప్రమాదం జరిగింది. ముందు వెళుతున్న లారీని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో కర్ణాట రాష్ట్రానికి చెందిన ఎక్సైజ్ డీఎస్పీ, ఎస్‌ఐ, వారి కుటుంబీకులున్నారు. వివరాలు.. కర్ణాటకలోని హుస్నూర్‌కు చెందిన ఎక్సైజ్ డీఎస్పీ విజయకుమార్ తన కుటుంబంతో కలసి తిరుమల శ్రీవారి దర్శనానికి కారులో వెళ్లారు. దర్శనానంతరం తిరుగుప్రయాణంలో ఉండగా కారు ముందు వెళుతున్న లారీని వెనకనుంచి ఢీకొంది. దీంతో డీఎస్పీ తండ్రి తిరుమల గిరిగౌడ(80) అక్కడిక్కడే మృతిచెందారు. డీఎస్పీ విజయకుమార్(43)కు రెండు కాళ్లు విరిగిపోయాయి. హుస్నూర్ గోకుల ఎక్సైజ్ ఎస్‌ఐ లోకేష(39), డీఎస్పీ తల్లి చిక్ తాయారమ్మ(77), శోభ(45)తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో బెంగళూరులోని జాలప్ప ఆస్పత్రికి తీసుకెళ్లారు. తిరుమలగిరిగౌడ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





క్షతగాత్రులు చిక్ తాయారమ్మ, డీఎస్పీ విజయకుమార్

వర్షానికి నేలకూలిన ఇల్లు



కుప్పంరూరల్ : మండలంలోని గుడ్లనాయనపల్లెలో రెండు రోజులుగా కురిసిన వర్షానికి కృష్ణప్ప అనే వ్యక్తి ఇల్లు నేలకూలింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం క్రాస్ వద్ద శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. తమిళనాడులోని మహిమండలం గ్రామానికి చెందిన గౌస్‌మొహిద్దీన్(17) బొమ్మసముద్రంలోని ఓ చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. వెన్నంపల్లె క్రాస్‌కు వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ఇంతలో కోలార్ నుంచి వస్తున్న ఐషర్ వాహనం ఢీకొంది. దీంతో మొహిద్దీన్ అక్కడికక్కడే మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐలు చలపతి, మునివేలు తెలిపారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

చౌడేపల్లె : మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ బండమీదపల్లెలో పిడుగుపాటుకు ఆవు మృతి చెందింది. వివరాలు.. అమరావతి అనే మహిళ మేత కోసం ఆవులను తోలుకెళ్లింది. తిరిగి ఇంటికి వస్తుండగా ఘటన జరిగింది. పిడుగుపాటుకు రూ.80 వేల విలువైన ఆవు మృతి చెందగా రూ.70 వేలు విలువ చేసే మరో ఆవు నడవలేని స్థితిలో ఉందని బాధితురాలు వెల్లడించింది. అక్కడే చెట్టు దగ్గర ఉన్న సుస్మిత, నవనీత అనే ఇద్దరు పిడుగుపాటుకు షాక్‌కు గురవడంతో వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సారా పట్టివేత : ఇద్దరి అరెస్ట్

పాలసముద్రం : మండలంలోని అయ్యవారికండ్రిగ వద్ద మిద్దెనత్తం వంకలో సారా తయారు చేస్తున్న ఇద్దరి అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు. నిందితుల నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని, 6వేల లీటర్ల ఊటను ధ్వంసం చేశామని వెల్లడించారు. ఈ కేసులో మోహన్, అరుణ్ అనే ఇద్దరి అదుపులోకి తీసుకున్నామని, విజయ్, రవి అనే ఇద్దరు పరారయ్యారని వివరించారు.



నిందితుల అరెస్ట్ చూపుతున్న, ఎస్‌ఐ ప్రసాద్

వైఎస్సార్‌సీపీలోకి పలువురు నేతలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక శంకరయ్యగుంటకు చెందిన పలువురు నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. శనివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో వారికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కండువా కప్పి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు ప్రకాష్, దినేష్, దాసు పాల్గొన్నారు. అలాగే సంతపేటకు చెందిన పార్టీ నేత భూపేష్ ఆధ్వర్యంలో పెద్దహరిజనవాడకు చెందిన పలువురు యువకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ మెంబర్ కిరణ్, పార్టీ నాయకులు రుక్కు, సూరి, తేజ, యువరాజ్, నవీన్, కుమార్, సాయి, కృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులు వేగవంతం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఇంచార్జి కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం విజయవాడ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని జిల్లా ప్రగతిని వివరించారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ రైతుభరోసా, సచివాలయాలు, హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాల పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్‌ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఇంచార్జి కలెక్టర్ శ్రీనివాసులు

పకడ్బందీగా సర్టిఫికెట్ల పరిశీలన

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీపీఎస్సీ గ్రూప్–4 అభ్యర్థుల సర్టిఫికెట్లను పకడ్బందీగా పరిశీలించినట్లు ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. జేసీ మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో 66 పోస్టుల భర్తీకి కంప్యూటర్ పరీక్షల్లో అర్హులైన వారి విద్యార్హత, కుల, ఆదాయ ఇతర సంబంధిత ధ్రువీకరణ పత్రాలను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రాజశేఖర్, ఏఓ కులశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు

సాంబారులో పడి విద్యార్థినికి గాయాలు

చౌడేపల్లె : చారాల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన కోసం సిద్ధం చేసిన సాంబారులో జారి పడిన విద్యార్థినికి గాయాలైన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. సుబ్రమణ్యం కుమార్తె తన్మయి 3వ తరగతి చదువుతోంది. శుక్రవారం భోజన సమయంలో పిల్లల మధ్య జరిగిన తోపులాటలో తన్మయి సాంబారు పాత్రలో పడిపోవడంతో చేతికి గాయమైంది. ఎంఈఓ కేశవరెడ్డి బాలికను పరామర్శించారు.